గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

మంచిర్యాల అర్బన్, జనవరి 16 : 2024-25 విద్యా సంవత్సరానికి TSWR, TTWR, MJP, TBCWR, TREI సొసైటీల్లో 5వ తరగతిలో ప్రవేశం కోసం ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆదిలాబాద్ రీజియన్, రీజినల్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూప ప్రకటనలో కోరారు. దరఖాస్తు చేసుకోవాలనే విద్యార్థులు http://tgcet. cgg.gov.in, http://tswreis. ac.in, http://mjpbcwreis.gov.in,http://tgtwgurukulam.telangana.gov.in వైబ్‌సైట్‌ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

నేటి నుంచి డిగ్రీ తరగతులు

బెల్లంపల్లి, జనవరి 16: ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఏ, బీకాం, బీఎస్సీ విద్యార్థులు 2, 4, 6 సెమిస్టర్ల తరగతులకు బుధవారం నుంచి హాజరు కావాలని ప్రిన్సిపాల్ టీ.ఎస్. ప్రవీణ్‌కుమార్ తెలిపారు. డిసెంబర్ 20 నుంచి నిర్వహించిన 1, 3, 5 సెమిస్టర్ల పరీక్షలు పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 17, 18 తేదీల్లో పరీక్ష ఉన్న బీఏ తృతీయ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులు ఆయా పరీక్షల మరుసటి రోజు నుంచి తరగతులకు హాజరు కావాలని తెలిపారు.

నియామకం

కాసిపేట, జనవరి 16 : కాసిపేట మండలంలోని మామిడిగూడకు చెందిన భూక్యా తిరుపతి నాయక్ యూత్ కాంగ్రెస్ కాసిపేట మండల ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కనుకుల రాకేశ్ చేతుల మీదుగా భూక్యా తిరుపతి నాయక్‌కు నియామకపత్రాన్ని అందించారు. ఈ మేరకు నాపై నమ్మకంతో మండల ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖమ్మ, ఎమ్మెల్యేలు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, గడ్డం వినోద్, మండల అధ్యక్షుడు వేముల కృష్ణ, యూత్ అధ్యక్షుడు కనుకల రాకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు పవన్ నాయక్, సాయి నాయక్, శశిధర్, రమేశ్, నరేశ్, శ్రీధర్, శ్రీను పాల్గొన్నారు.

సినీ, టీవీ రచయితలకు ఉచిత శిక్షణ

మందమర్రి, జనవరి 16: ఈ నెల 20న మంచిర్యాలలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, తెలుగు టీవీ రచయితల సంఘం సంయుక్తంగా జిల్లా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఔత్సాహిక సినీ, టీవీ రచయితలకు ఉచిత శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో సాంస్కృతి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కొమ్మెర విశ్వేశ్వర శర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి అంతడుపుల నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పులేటి నరేశ్ తెలిపారు. ప్రముఖ సినీ, టీవీ దర్శకుడు నాగబాల సురేశ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఈ ఉచిత శిక్షణ శిబిరంలో సినీ దర్శకుడు వీ ఎన్ ఆదిత్య, ప్రముఖ రచయిత తోటపల్లి సాయినాథ్, యువ దర్శకుడు దండ నాయక్, స్క్రీన్ ప్లే రచయిత శ్రీశైలం మూర్తి పాల్గొని శిక్షణ ఇస్తారని వారు తెలిపారు. సినీ, టీవీ రంగాల్లో రాణించాలని అనుకునే వారికి మూలకథ, సన్నివేశ ప్రాధాన్యం, పాత్ర రూపకల్పన, ప్రారంభ, ముగింపు సన్నివేశాలు తదితర 24 శాఖలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని ఔత్సాహికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం కొమ్మెర విశ్వేశ్వర శర్మ 9440062158, అంతడుపుల నాగరాజు 9440001886, ఉప్పులేటి నరేశ్ 9440445927 నంబర్‌లలో సంప్రదించాలని తెలిపారు.

ఉరివేసుకొని ఒకరి ఆత్మహత్య

కాసిపేట, జనవరి 16 : కాసిపేట మండలంలోని సాలేగూడ గ్రామానికి చెందిన కుడిమేత గంగు(52) సోమవారం మద్యానికి బానిసై మద్యం మత్తులో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. సాలేగూడకు చెందిన కుడిమేత గంగు సోమవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి సాలేగూడ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో చెట్టుకు చున్నీతో ఉరి వేసుకోగా అటుగా వెళ్తున్న గొర్ల కాపరి చూసి సమాచారం ఇవ్వగా వెళ్లి చూడగా చనిపోయి ఉన్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబురాలు

• ఆలయాల్లో ప్రత్యేక పూజలు • ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

కాసిపేట : ముగ్గులను పరిశీలిస్తున్న పోటీల న్యాయ నిర్ణేతలు, అతిథులు

మందమర్రిలో పతంగులు ఎగుర వేస్తున్న యువకులు, చిన్నారులు

మంచిర్యాల ఏసీసీ, జనవరి 16 : మంచిర్యాల జిల్లా కేంద్రంలో సోమవారం పట్టణ వాసులు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు వేకువజామునే వాకిళ్లలో రంగురంగుల ముగ్గులను వేశారు. ఆవుపేడతో గొబ్బెమ్మలు. నవధాన్యాలు, రేగిపళ్లు పెట్టి పూజలు చేశారు. అనంతరం ఇంటింటా పిండి వంటలు చేసుకొని పండుగను నిర్వహించారు. చిన్నారులు, పెద్దలు ఇంటి మీద గాలిపటాలు ఎగురవేస్తూ సందడిగా గడిపారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆకాశ దీపాలు వెలిగించారు. జిల్లా కేంద్రంలోని ఐదో వార్డు సాయికుంటలో యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన మహిళలకు వార్డు కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ బహుమతులను అందజేశారు.

దండేపల్లిలో..

దండేపల్లి, జనవరి16 : దండేపల్లి మండలంలో సంక్రాంతి సంబురాలను ఘనంగా నిర్వహించారు. ముగ్గులు వేసి గొబ్బెమ్మలు, నవధాన్యాలు ఉంచారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.చిన్నారులు గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేశారు.

కోటపల్లిలో..

కోటపల్లి, జనవరి 16 : కోటపల్లి మండలంలో సంక్రాంతి, కనుమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పతంగుల పంపిణీ

శ్రీరాంపూర్, జనవరి 16 : శ్రీరాంపూర్ కాలనీ, ఆర్కే 6 గుడిసెలు హిమ్మత్‌నగర్‌లో వాసవీ క్లబ్ నస్పూర్ పట్టణ అధ్యక్షుడు సకినారపు దత్తాత్రేయ, కార్యదర్శి అయిత వివేక్, కోశాధికారి టీ అశోక్, వ్యవస్థాపక అధ్యక్షుడి రావి కిషన్ ఆధ్వర్యంలో పిల్లలు, విద్యార్థులకు పతంగులు(కైట్)లు పంపిణీ చేశారు. స్వీట్లు పంచి పెట్టి సంబురాలు నిర్వహించారు. పతంగులు ఎగురవేసే పిల్లలు, విద్యార్థులు చైనా మాంజాను ఉపయోగించరాదని కోరారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ మాజీ అధ్యక్షుడు భూమయ్య, నాయకులు సూదం శివప్రసాద్, అల్లంకి శ్రీనివాస్, నికుట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెన్నూర్‌లో..

చెన్నూర్ టౌన్, జనవరి 16 : చెన్నూర్‌లో సంక్రాంతి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు వారివారి సన్నిహితుల, బంధువుల ఇండ్లకు వెళ్లి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

శివగణేశ్ యూత్ ఆధ్వర్యం ముగ్గుల పోటీలు

దండేపల్లి, జనవరి16: దండేపల్లి మండలంలోని తాళ్లపేటలో శివగణేశ్ యూత్ ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. కబడ్డీ, టగ్ అఫ్ వార్ పోటీలు నిర్వహించారు. అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పుట్టపాక తిరుపతి, నాయకులు కంది సతీశ్‌కుమార్, శివగణేశ్ యూత్ అధ్యక్షుడు దుర్గం భానేశ్, దుర్గం రవీందర్, జాడి రాజేందర్, దుర్గం శేఖర్, న్యాయ నిర్ణేతలుగా సంపత్, శ్రీనివాస్, ఆరాధ్య వ్యవహరించారు.

జన్నారంలో..

జన్నారం, జనవరి 16 : మండలంలోని పొనకల్ గ్రామ పంచాయతీలోని రాంనగర్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన ముగ్గురు మహిళలు సీహెచ్ నీరోషా, తిరుమల, వనితకు జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, పొనకల్ సర్పంచ్ జక్కు భూమేశ్ బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జాజాల శ్రీనివాస్, ఎంపీటీసీ హరణీమధుసూదన్‌రావు, విశ్వ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల గంగాధర్, ఐద్వా అధ్యక్షురాలు పీ విజయ, లింగంపెల్లి రాయలింగం, కనకయ్య, జీ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

నస్పూర్‌లో..

సీసీసీ నస్పూర్, జనవరి 16: నస్పూర్‌లోని ఓమాక్స్ సిటీ విల్లాస్‌లో ముగ్గుల పోటీలను నిర్వహించారు. కైలాస రవీందర్‌రావు సతీమణి స్వర్గీయ కైలాస అండాలమ్మ స్మారకార్థం ఓమాక్స్ కాలనీలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాచకొండ వెంకటేశ్వర్‌రావు, రాపోలు జనార్దన్ రావుతో పాటు కాలనీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

కాసిపేటలో..

కాసిపేట, జనవరి 16 : కాసిపేట మండలంలోని కోమటిచేను గ్రామంలో యువరాజ్యం యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు నిర్వహించారు. రాష్ట్ర వాల్మీకి బోయ ఎస్టీ సాధన సమితి చైర్మన్ గొంది వెంకటరమణ, సర్పంచ్ రాంటెంకి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ జాడి శంకరయ్య సహకారంతో నిర్వహించారు. అనంతరం పలు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. న్యాయ నిర్ణేతులుగా ఆర్ఐ సులోచన, ఏఈ స్వర్ణలత వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో యువరాజ్యం యూత్ అధ్యక్షుడు జనగామ శ్రీనివాస్, నాయకులు బొల్లు రమణారెడ్డి, దుర్గం పోశం, పూస్కూరి వంశీకృష్ణారావు, ఎంపీటీసీ చంద్రమౌళి, రాంటెంకి వాస్‌దేవ్, సాగర్, మాసు సుధాకర్, జాడి కిరణ్, దుర్గం గణేశ్, సాయిని స్వామి, దుర్గం వినోద్, సంకూరి సురేశ్, పులి రాజశేఖర్ పాల్గొన్నారు.

సీసీసీ నస్పూర్ : బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

మంచిర్యాల ఏసీసీ : బహుమతులను అందజేస్తున్న కౌన్సిలర్ హరికృష్ణ

దండేపల్లి : బహుమతులు అందజేస్తున్న నాయకులు

జన్నారం : విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్

శ్రీరాంపూర్ : పతంగులు పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ నాయకులు

తాళ్లపేటలో ముగిసిన క్రికెట్ పోటీలు

దండేపల్లి : విజేతగా నిలిచిన జట్టుతో నాయకులు

దండేపల్లి, జనవరి16 : దండేపల్లి మండలంలోని తాళ్లపేటలో సందెల శశాంక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. జన్నారం మండలం రాంపూర్‌కు చెందిన జట్టు లింగాపూర్ జట్టుపై విజయం సాధించి ట్రోఫీ గెలుచుకున్నది. నాయకులు క్రీడాకారులకు ట్రోఫీలు, మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంది సతీశ్‌కుమార్, అడాయి కాంతారావు, సందెల శ్రీధర్, సాదిక్, సల్లు, ఆర్గనైజర్ సందెల శంకర్, వంశీ, రాంపూర్ ఉపసర్పంచ్ రవి, నాయకులు కాల్వ గంగన్న, దాసరి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

బోయపల్లిలో..

తాండూర్, జనవరి 16 : మండలంలోని బోయపల్లిలో మాసాడి కీర్తి వర్ధన్, శశివర్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మాసాడి విష్ణువర్ధన్ స్మారక క్రికెట్ టోర్నీ సోమవారం ముగిసింది. గొండగూడెం గ్రామానికి చెందిన బొజ్జిరావు జట్టు విన్నర్‌గా నిలిచింది. రన్నర్‌గా బోయపల్లికి చెందిన తుపాకుల రాంబాబు జట్టు నిలిచింది. విన్నర్, రన్నర్ టీమ్‌లకు నగదు బహుమతితో షీల్డ్‌లను నిర్వాహకులు అందించారు. ఈ క్రికెట్ పోటీలు రెండు రోజుల పాటు కొనసాగాయి. బోయపల్లితో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన టీమ్‌లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మాసాడి సత్యనారాయణ, మాసాడి భీమయ్య, లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ రౌతు వెంకటేశం, సింగిల్‌విండో డైరెక్టర్ మాసాడి తిరుపతి, యువకులు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

తాండూర్ : బోయపల్లిలో విన్నర్ జట్టుకు షీల్డు అందజేస్తున్న నాయకులు

మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

వేమనపల్లి : క్రీడాకారులతో ఎంపీటీసీ, సర్పంచు తదితరులు

వేమనపల్లి, జనవరి 16 : వేమనపల్లి మండల కేంద్రంలో ఎంపీటీసీ రుద్రభట్ల సంతోష్‌కుమార్ ఆర్థిక సహాయంతో నిర్వహిస్తున్న బోర్కుటి రవి స్మారక వాలీబాల్ టోర్నమెంట్ మంగళవారం ప్రారంభమైంది. టోర్నమెంట్‌ను నీల్వాయి ఎంపీటీసీ సంతోష్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీయడానికి పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ. 12,500, ద్వితీయ బహుమతి రూ. 6,500 అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ సాబీర్ ఆలీ, సర్పంచ్ గాలి మధు, నాయకులు రామచంద్రం, పూర్ణ చంద్రారెడ్డి, పురుషోత్తం, శీను, రాజారాం, తిరుపతి, వినోద్‌రెడ్డి, శేఖర్, రాము తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపేటలో..

దండేపల్లి, జనవరి16: దండేపల్లి మండలంలోని తాళ్లపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో కంది నరేశ్-సందెల శశాంక్ స్మారకార్థం నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జన్నారం, దండేపల్లి మండలాలకు చెందిన 18 జట్లు టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. స్థానిక నాయకులు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చూపాలన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను చదువుకే పరిమితం చేయకుండా క్రీడల్లోనూ ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంది సతీశ్‌కుమార్, అడాయి కాంతారావు, కంది రవి, భక్తవార్‌ఖాన్, హైదర్‌ఖాన్, మంత్రి దేవయ్య, మర్రిపెల్లి సత్తయ్య, సందెల శ్రీధర్, సాదిక్, సల్లు, ఆర్గనైజర్ బోడకుంట మహేష్(పులి), సందెల వంశీ, అప్రోజ్, తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి : పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

మకరవిళక్కు పూజలు

శ్రీరాంపూర్, జనవరి 16 : శ్రీరాంపూర్ కాలనీ అయ్యప్ప సేవా సన్నిధానంలో సోమవారం రాత్రి అయ్యప్ప స్వామి భక్తులు మకరవిళక్కు పూజలు, సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీరాంపూర్ అయ్యప్ప సేవా సన్నిధానం అధ్యక్షుడు బొడ్డు లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు వంగ శివకుమార్ ఆధ్వర్యంలో అయ్యప్ప సేవా సన్నిధానంలో ప్రత్యేక పూజలు చేశారు. శబరిమళ అయ్యప్ప సన్నిధానం వద్ద మకర జ్యోతిని ప్రత్యక్ష ప్రసారం ద్వారా భక్తులు వీక్షించారు. అనంతరం భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రాజు, మధు, లోహిత్, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు వరం గురుకులాలు

• టీజీపీఏ నాయకులు

మందమర్రిలో కర పత్రాలను విడుదల చేస్తున్న టీజీపీఏ నాయకులు

మందమర్రి, జనవరి 16: తెలంగాణ గురుకులాలు (సాంఘిక సంక్షేమ) పాఠశాలలు నిరుపేద విద్యార్థులకు వరం లాంటివని తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్(టీజీపీఏ) నాయకులు అన్నారు. తెలంగాణ గురుకులాల్లో ప్రవేశానికి సంబంధించిన ప్రచార కరపత్రాలను మంగళవారం స్థానిక సింగరేణి పాఠశాల ఆవరణలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరానికి సంబందించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు ఐదవ తరగతిలో ప్రవేశాల కోసం ప్రభుత్వం నోటిఫికేషన్‌ను విడుదల చేసిందని ఈ నెల 20వ తేదీ నాటికి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజీపీఏ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉప్పులేటి నరేశ్, రాష్ట్ర మహిళా కోకన్వీనర్ ఉప్పులేటి గోపిక, తోకల నిరోషా, రా సరి రాజనర్సు, సంగి సంతోశ్, నెరువట్ల రాజలింగు, సాగే పోచయ్య, మంతెన సదానందం, కొండ సతీశ్, మాడుగుల రామన్న, ఉప్పులేటి ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

అన్నారంలో రాములోరి అక్షింతల పంపిణీ

తాండూర్, జనవరి 16 : మండలంలోని రేచిని గ్రామపంచాయతీ పరిధిలోని అన్నారంలో అయోధ్య నుంచి వచ్చిన రాములోరి అక్షింతల పంపిణీ చేశారు. తాండూర్ శివాలయం నుంచి అక్షింతల తీసుకురాగా అన్నారం గ్రామ శివారు నుంచి ఆంజనేయ స్వామి ఆలయం వరకు మహిళలు మంగళ హారతులతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి అక్షింతలు పంపిణీ చేశారు.

అన్నారంలో రాములోరి అక్షింతల శోభాయాత్ర

బాల్య మిత్రుడికి బాసటగా..

ఆర్థిక సహాయం అందజేస్తున్న మిత్రబృందం

దండేపల్లి, జనవరి16: దండేపల్లి మండలంలోని రెబ్బెన్‌పెల్లి గ్రామానికి చెందిన కుష్టపల్లి రమేశ్ భార్య గంగాజమున ఇటీవల అనారోగ్యంతో మరణించింది. రమేశ్‌తో కలిసి పాఠశాలలో చదువుకున్న బాల్య మిత్రులు(2000-01 పదోతరగతి)రూ.20వేల ఆర్థిక సహాయం అందించారు. అనంతరం తల్లిని కోల్పోయిన లాస్య పేరుమీద రూ.21వేలు ఫిక్స్ డిపాజిట్ చేయించారు. పిల్లల భవిష్యత్, ఉన్నత చదువులకు సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల్య మిత్రులు గొర్ల సుధాకర్, దాసరి శ్రీనివాస్, కాంద్రపు శ్రీనివాస్, పింగిలి మల్లేశ్, పనాస రమేశ్, ముత్యం నాగవర్మ, అక్కల రాజన్న, తదితరులు ఉన్నారు.

కులగణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

మాట్లాడుతున్న బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు

మంచిర్యాల అర్బన్, జనవరి 16 : కులగణన తర్వాతే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. మంచిర్యాల పట్టణంలోని జన్మభూమి నగర్‌లో బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీ కులగణన నిర్వహించి, బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు. మరో 15 రోజుల్లో సర్పంచ్ పదవి కాలం ముగుస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రయత్నిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ సభలో ప్రకటించిన విధంగా బీసీ కులగణన చేసి, స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్ల పెంపుతో పాటు ఏబీసీడీ గ్రూపులుగా వర్గీకరించయాలన్నారు. రాష్ట్రంలో మొత్తం సర్పంచ్ స్థానాలు 12751 ఉంటే 6350 సర్పంచ్ స్థానాలు బీసీలకు అవకాశాలు వచ్చే అవకాశాలున్నాయని, బీసీలకు జనాభా ప్రాతిపదికన అవకాశాలు రావాలంటే అది బీసీ కులగణతోనే సాధ్యం కాబట్టి ముందుగా బీసీ కులగణన చేపట్టి బీసీల న్యాయమైన డిమాండ్ ను బీసీల ఆకాంక్షను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, నాయకులు కట్కురి శ్రీనివాస్, నార్ల మహేందర్, అంకం సతీశ్, మగిడి రాజశేఖర్, తోకల వెంకటేశ్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథాలయ అర్చకులకు సన్మానం

జగన్నాథ ఆలయ అర్చకుల దంపతులను సత్కరిస్తున్న భక్తులు

చెన్నూర్ టౌన్, జనవరి 16 : చెన్నూర్ పట్టణంలోని జగన్నాథ ఆలయ అర్చకులను భక్తులు ఘనంగా సన్మానించారు. ఆలయ ప్రధానార్చలు దామెర మోహనాచార్యుల దంపతులు, దామెర అనిల్ ఆచార్యుల దంపతులను చెన్నూర్ పట్టణానికి చెందిన భక్తులు మంగళవారం సత్కరించారు. కొన్నేళ్లుగా జగన్నాథ స్వామి అర్చక సేవలో తరిస్తున్న వారి కుటుంబానికి జగన్నాథ స్వామి కరుణా కటాక్షాలు ప్రసరించాలని కోరుకున్నారు. అనంతరం వారి ఆశీర్వాదం తీసుకున్నారు.

నస్పూర్‌లో రక్తదాన శిబిరం

శిబిరాన్ని ప్రారంభిస్తున్న యూనియన్ అధ్యక్షుడు సీతారామయ్య

సీసీసీ నస్పూర్, జనవరి 16: సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో మంగళవారం సీసీసీ నస్పూర్ నర్సయ్య భవన్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ బ్లడ్ డొనేషన్ క్యాంపును యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో శ్రీరాంపూర్ ఏరియా నుంచి భారీ మెజార్టీతో గెలిపించినందుకు కార్మికులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ నాయకులు, కార్యకర్తలు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, ఏరియా బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, నాయకులు కొమురయ్య, చంద్రమోహన్, ప్రసాద్‌రెడ్డి, మురళీ చౌదరి, నవీన్‌రెడ్డి, కామెర వేణు, నర్సింగరావు, అప్రోజ్‌ఖాన్, ఆకుల లక్ష్మణ్, జీపీ రావు, తదితరులు పాల్గొన్నారు.

జీపీడీపీపై అవగాహన

మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

తాండూర్, జనవరి 16 : 2024-25 సంవత్సరానికి గాను గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) రూపొందించేందుకు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా 2024-25 సంవత్సరానికి జీపీడీపీ ప్లాన్ తయారు చేసేందుకు మండలంలోని అన్ని శాఖలకు సంబంధించిన వివరాలు పథకాల వారీగా సేకరించి గ్రామ సభలు నిర్వహించి వచ్చే సంవత్సరానికి ప్రణాళిక అన్ని గ్రామ పంచాయతీలు సిద్ధం చేయాలని తెలిపారు. అవగాహన కార్యక్రమానికి తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, ఎంపీవో సత్యనారాయణ, వెటర్నరీ డాక్టర్ భూమయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత, ఐకేపీ ఏపీఎం పుమానాయక్, ఏఈవో శంకర్, ఇతర శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.